పిపి హరినాథ్ రెడ్డి పై ఫయాజ్ ఆరోపణలు అర్ధరహితం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

పిపి హరినాథ్‌రెడ్డిపై ఫయాజ్ చేసిన ఆరోపణలు అర్ధరహితమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప పేర్కొన్నారు. ఫయాజ్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిపి హరినాథ్ రెడ్డి నిత్యం పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఎంతోమంది పేదల కేసులను నయా పైసా ఖర్చు లేకుండా పరిష్కారానికి కృషి చేస్తున్న హరినాథ్ రెడ్డిపై చేసిన ఆరోపణలు అర్ధరహితమన్నారు. తనపై చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేస్తే వాస్తవాలు బయటికి వస్తాయని హరినాథరెడ్డి చెప్పిన దానికి ఫయాజ్ సమాధానం చెప్పాలని కోరారు. పేద ప్రజల సమస్యల పట్టుదలతో పనిచేస్తూ పేదలందరికీ న్యాయం జరగాలని కోరుకునే వారిలో హరినాథరెడ్డి లాంటివారు ఒకరు అలాంటి వారిని నిందించడం సమంజసమైనది కాదని అన్నారు.

సచివాలయ ఉద్యోగులకు 'సర్వే'ల ఒత్తిడి



- ◆ అధికారుల ఒత్తిడి తట్టుకోలేకపోతున్న ఉద్యోగులు
- ◆ 10 నెలల కూటమి పాలనలో 19 సర్వేలు
- ◆ రేషనలైజేషన్ పేరుతో ఉద్యోగుల కుదింపు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా మారింది. గత ప్రభుత్వం వాలంటీర్లతో చేయించిన సర్వేలను, ఇతర పనులను ఇప్పుడు సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు. సర్వేల టార్గెట్లతో మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఒలు తెస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక సచివాలయాల ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో దాదాపు 19 సర్వేలు చేయించింది. అయితే ఇప్పటి వరకు ఏ ఒక్కరికీ రేషన్ కార్డు కాని, ఫింఛను గాని మంజూరు చేయలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1207 వరకూ గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వం 12, 966 పోస్టులు మంజూరు చేస్తే ఇందులో 10, 083 సచివాలయ సెక్రటరీలు పని చేస్తున్నారు. ఇక రెండు జిల్లాల్లో చూస్తే అనంతపురం జిల్లాలో 663 సచివాయాలకు గాను 7106 మంది సెక్రటరీలు ఉండాల్సి ఉంటే 5615 మంది ఉన్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలో 544 సచివాయాలకు గాను 5860 మంది సెక్రటరీలు ఉండాల్సి ఉంటే 4468 మంది ఉన్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అనేక అంశాలపై క్షేత్ర స్థాయిలో సమాచారం తెలుసుకునేందుకు సచివాలయ ఉద్యోగులతో ఉన్నతాధికారులు పలు రకాల సర్వేలు చేయిస్తున్నారు. ఇలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో దాదాపు 19 వరకూ సర్వేలు చేయించిన పరిస్థితి ఉంది. ఒక సర్వే పూర్తికాకముపే మరో సర్వే అప్పగిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పదేపదే ఇళ్లకు వెళ్లడంతో ఒకసారి రావొచ్చుకదా... అన్నిసార్లు ఎందుకు వస్తున్నారంటూ ఉద్యోగులపై జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 2019 అక్టోబర్ రెండో తేదీన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రారంభమైంది. రెండు వేల మందికి ఒక సచివాలయం చొప్పున ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయంలోనూ డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా పోలీస్, ఎఎస్ఎం. సర్వేయర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ ఇలా 11 శాఖలకు చెందిన ఉద్యోగులు ఉండేలా ముందుకు సాగింది. అయితే సచివాలయ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడం, ఇతర ప్రాంతాల బాధ్యతలు కూడా వారికే అప్పగించడంతో పనిభారం మరింత పెరిగింది.

దీంతో, వివిధ ధ్రువపత్రాలు, ఇతర పనుల కోసం సచివాలయాలకు వచ్చే వారికి వారు అందుబాటులో ఉండలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 11 మంది, పట్టణ ప్రాంతాల్లో పది మంది ఉద్యోగులతో గత ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఏడుగురు, పట్టణ ప్రాంతాల్లో ఆరుగురు మాత్రమే ఉంటున్నారు. బ్యాంకర్లు తమ ఖాతాదారుల ఆధార్ లింక్, ఇకెవైసి బాధ్యతలను కూడా ఇటీవల సచివాలయాల ఉద్యోగులకు అప్పగించడం వివాదస్పదమైంది. ఈ పనిని బ్యాంకు ఉద్యోగులు చేయాల్సి ఉండగా వివిధ పథకాల కింద నిధులు జమ చేసే పేరుతో అధికారులు ఈ బాధ్యతలను తమకే అప్పగించారని సచివాయాల ఉద్యోగులు వాపోతున్నారు. ఐటి శాఖ చేయాల్సిన వర్క్ ఫ్రం హోం, సిటిజన్స్ గుర్తింపు సర్వేనూ తమకే అప్పగించినట్లు చెబుతున్నారు. తాజాగా పి4 సర్వే మొత్తం సచివాలయాలకు అప్పగించారు. పరిశ్రమల శాఖ నిర్వహించాల్సిన ఎంఎస్ఎంఇ సంస్థల గుర్తింపును తమకే అప్పగించారని సచివాలయాల ఉద్యోగులు వాపోతున్నారు. తుపాన్లు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, వ్యక్తుల నివాసిత గుర్తింపు వివరాల నమోదుకు ఇంటి ఫొటోలు, జియోట్యాగింగ్ బాధ్యతలు ఇటీవల సచివాలయాల ఉద్యోగులు పూర్తి చేశారు. నేషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చిన్నారులను గుర్తించి, ఆధార్‌లో నమోదు చేయించే బాధ్యతలను కూడా వారికే అప్పగించారు. చర్మకారులకు పలు పథకాల అమలుకు లబ్ధిదారులను గుర్తించడం, పింఛనుదారుల్లో అనర్హుల గుర్తింపునకు వారికి నోటీసులు జారీ చేయడం, వికలాంగులను తిరిగి వైద్య పరీక్షలకు పంపడం తదితర పనులను సచివాలయ ఉద్యోగులతోనే చేయిస్తున్నారు. సహకార సంఘాల్లో రికార్డుల కంప్యూటీకరణలో భాగంగా రైతులకు ఇకెవైసి చేయడాన్ని సంబంధిత శాఖ ఉద్యోగులకు కాకుండా ఈ పని కూడా సచివాలయాల ఉద్యోగులకే అప్పగించారు. సిటిజన్ గుర్తింపు, గుర్తింపు సర్వే మున్సిపల్, గ్రామ పంచాయతీలు చేయాల్సి ఉండగా ఈ పని కూడా సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు. రైతులకు సంబంధించిన భూ ఆధార్ నమోదును సచివాలయాల్లోని వ్యవసాయ సహాయకుడికి అప్పగించారు. బియ్యం కార్డుల్లోని సభ్యులు ఇకెవైసి బాధ్యతను విఆర్ఒ చేయాల్సి ఉండగా, ఈ పని కూడా తమకే అప్పగించారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వాలంటీర్లు చేసిన ప్రతి పనినీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించారు. వివిధ శాఖల ఉద్యోగులు చేయాల్సిన అన్ని పనులనూ తమకే అప్పగిస్తున్నారని, దీనివల్ల సచివాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండలేకపోతున్నారని, తద్వారా పౌర సేవల్లో కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని సచివాలయాల ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా నాయకులు తెలిపారు. మున్సిపాలిటీల్లో, మండల పరిషత్తుల్లో అనేకమంది ఉద్యోగులు ఉన్నా ప్రతి పనికీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించేస్తున్నారని వారు చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులపై పని భారం తగ్గించాలని, సంబంధం లేని పనులు అప్పగించ రాదని వారు డిమాండ్ చేస్తున్నారు.

రేషలైజేషన్ తో 4100 పోస్టులకు ఎసరు

ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ, ఉద్యోగులకు సంబంధించిన రేషనలైజేషన్‌ను ప్రారంభించింది. సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించింది. 2,500 జనాభాలోపు ఉన్న సచివాయాలను 'ఎ' కేటగిరీలో, 2,500 నుంచి 3,500 జనాభా ఉన్న వాటిని 'బి' కేటగిరీలో, 3,500 జనాభా పైన ఉంటే 'సి' కేటగిరీలో పెట్టింది. ఉద్యోగులను రెండు రకాలుగా విభజించింది. మల్టీపర్పస్ ఉద్యోగులుగా పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు ఉన్నారు. టెక్నికల్ ఉద్యోగులుగా విఆర్‌డి, ఎఎన్ఎం, సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు, లైన్మెన్లు ఉన్నారు. 'ఎ' కేటగిరీలో సచివాలయాలకు కేటాయించిన ఆరుగురు ఉద్యోగుల్లో పంచాయతీ సెక్రటరీ లేక డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ లేక మహిళా పోలీస్ తోపాటు మరో నలుగురు టెక్నికల్ ఉద్యోగులు ఉంటారు. 'బి' కేటగిరీలో పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ లేక మహిళా పోలీస్ తోపాటు మరో నలుగురు టెక్నికల్ ఉద్యోగులు ఉంటారు. 'సి' కేటగిరి సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్ తోపాటు మరో నలుగురు టెక్నికల్ ఉద్యోగులు ఉంటారు. 'ఎ', 'బి' కేటగిరీల్లో వెల్ఫేర్ సెక్రటరీ లేకపోతేనే మహిళా పోలీసులు ఉంటారు. దీంతో ఇప్పుడు ఆయా సచివాలయాల్లో ఉన్న మహిళా పోలీస్ ఉద్యోగులను ఎక్కడకు పంపిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. సగటున ప్రతి మండలంలో 12 నుంచి 20 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో నాలుగు నుంచి ఐదు వరకూ 3,500కు పైగా జనాభా ఉన్న 'సి' గ్రేడ్ సచివాలయాలుగా ఉన్నాయి. మిగిలిన చోట్ల పని చేస్తున్న మహిళా పోలీసులను ఏం చేస్తారో ప్రభుత్వం ఇంకా చెప్పకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. సచివాలయాల్లో ఉద్యోగుల సంఖ్యను కుదిస్తున్నారు. దీంతో ఒక్క హిందూపురం పురపాలక సంఘంలోనే 137 పోస్టులను తగ్గిస్తున్నారు. ఇక జిల్లాల వారిగా చూస్తే అనంతపురం జిల్లాలో దాదాపు 2600 పోస్టులు, శ్రీ సత్య సాయి జిల్లాలో 1500 పోస్టులకు ప్రభుత్వం ఎసరు పెడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సచివాలయ ఉద్యోగులకు సర్వేలు, పింఛన్ల పంపిణీ వంటి పనిభారం మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో సచివాలయ ఉద్యోగుల్లో తీవ్ర టెన్షన్ నెలకొంది,

పట్టణంలో సర్వే నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగి

అనంతపురం నగరంలో నిర్వహిస్తున్న భారీ నిరసన ప్రదర్శన

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

'అనంత' యుజెఎసి ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-అనంతపురం

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు అనంతపురం నగరంలో భారీ ర్యాలీని నిర్వహించింది. ఈ ర్యాలీకి సిపిఎం, సిపిఐ, కాంగ్రెసు, వైసిపి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీతోపాటు మానవ హక్కుల వేదిక నాయకులు వివిధ పౌర, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. అనంతపురం నగరంలోని జూనియర్ కళాశాల నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు ముస్లిము మైనార్టీలు వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ వేలాది సంఖ్యలో నిరసన ప్రదర్శన చేపట్టారు. జాతీయ పతాకాన్ని ఒకచేత, నల్లజెండాలు మరో చేతులో పట్టుకుని ఈ నిరసన చేపట్టారు. యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్‌గా సి.జాఫర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప మాట్లాడుతూ దేశంలో బిజెపి మతతత్వ విధానాలను అవలంభించడం ద్వారా ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అదే విధంగా వక్ఫ్ చట్టాన్ని సవరించి, వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. బిజెపి అనుసరిస్తున్న ఈ ప్రజా వ్యతిరేకత విధానాలను కులాలు, మతాలకు అతీతంగా తిప్పికొట్టాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. సమైక్యంగా తిప్పికొట్టేందుకు జరిగే ఈ పోరాటంతో సిపిఎం మద్దతుగా ఉంటుందని చెప్పారు. సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీశ్ మాట్లాడుతూ బిజెపి మతోన్మాద విధానాలను కలసికట్టుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇది వక్ఫ్ భూములతోనే పోదని, క్రిస్టియన్ మైనార్టీల ఆస్తులు, ఆ తరువాత హిందు మతంపైనా దాడి చేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అందరూ ఈ చట్ట సవరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి మద్దతునివ్వాలని పిలుపునిచ్చారు. కాంగ్రెసు జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెసు హయంలో అనేక సార్లు సవరణ చేసినా దానికి బలోపేతం చేసే విధంగా చేస్తూ వచ్చిందన్నారు. బిజెపి మాత్రం ఈ చట్టాన్ని బలహీనరిచే విధంగా సవరణ చేపట్టిందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా సాగే పోరాటాల్లో కాంగ్రెసు మద్దతు ఉంటుందని చెప్పారు. నగర మేయరు వసీం మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణ సరైంది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం న్యూడెమోక్రసి నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి , రైతు సంఘం నాయకులు నాగరాజు, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేకర్, అబ్దుల్ రసూల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నూర్ మహమ్మద్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎకెఎస్ ఫయాజ్, డిప్యూటీ మేయరు కొగటం విజయభాస్కర్‌రెడ్డి, ఎస్సీ,ఎస్టీ జెఎసి నాయకులు సాకే హరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో 'అనంత'

సుందరంగా రోడ్లు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే దగ్గుపాటి నగరంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని హౌసింగ్ బోర్డు నుంచి అశోక్‌నగర్ హరిహరదేవాలయం మీదుగా అంబేద్కర్ నగర్ వరకూ వెళ్లే ప్రధాన రోడ్డును సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వం వచ్చిన 10నెలల్లోనే ఇప్పటికే అనేక రహదారుల నిర్మాణం పూర్తి చేశారు. నూతన రహదారుల నిర్మాణం, గుంతలమయమైన రోడ్ల మరమ్మతులు, డ్రెయినేజీల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సుందరంగా తయారైన రోడ్లు

పరిగిలో ఘోర రోడ్డు ప్రమాదం

ముగ్గురు మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - పరిగి

శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం ధనాపురం సమీపంలో కొడికొండ చెక్ పోస్ట్- సిరా జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఏడుగురు హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయపడ్డారు. ఆటోను గుర్తుతెలియని వాహనం వెనుకవైపు నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబందించి స్థానికులు, మృతుల బంధువులు తెలిపిన వివరాలు... రొద్దం మండలం దొడగట్టకు చెందిన వారు హిందూపురం సమీపంలోని కొట్టి చౌడేశ్వరి దేవస్థానంలో భజన చేయడానికి శనివారం రాత్రి ఆటోలో వెళ్లారు. భజన అనంతరం ఆదివారం తెల్లవారుజామున తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోను పరిగి మండలం ధనాపురం సమీపంలోని జాతీయ రహదారి 544లో వెనుకవైపు నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో దొడగట్టగ్రామానికి చెందిన అలివేలమ్మ(45), ఆదిలక్ష్మమ్మ(65), సాకమ్మ(60) అక్కడికక్కడే మృతిచెందారు. విజయ్, సుజాత, అభి, బబ్లు, ప్రమీలమ్మ, అంజిరెడ్డి, రూప, యశ్వంత్ కుమార్, అంజినమ్మ, ఆటోబాబు, పాపమ్మ గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగుళూరుకు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రంగడుయాదవ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గురైన వారందరూ వ్యవసాయమే జీవనోపాధిగా కూలి పనులు చేసుకునే కుటుంబాలకు చెందిన వారు. వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఇటు రైతు సంఘం నాయకులు ఇటు పలు రాజకీయ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె. పార్థసారథి, హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ డిఇ రమేష్ తదితర నాయకులు పరామర్శించారు.ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గాయపడిన వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

మృతురాలు అలివేలమ్మ(ఫైల్‌ఫొటో)

మృతురాలు ఆదిలక్షి (ఫైల్‌ఫొటో)

మృతుల కుటుంబాలకు పరామర్శ

రొద్దం : పరిగి మండలం ధనాపురం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని దొడగట్ట గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలుసుకున్న పెనుగొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్ ఆదివారం సాయంత్రం మృతుల కుటుంబాలను పరామర్శించారు. దొడగట్ట గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధితులతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందే సాయం త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ లక్ష్మీదేవి, విఆర్ఒలు గోపాల్, రామమోహన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో పంచ ప్రాధాన్యతలు

జిల్లా నీటి యాజమాన్యసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ ప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం మొదటి త్రైమాసిక ప్రణాళికలో పంచ ప్రాధాన్యతలు అమలు చేసి అటు వ్యవసాయం అభివృద్ధికి ఇటు కూలీలకు ఉపయోగపడే విధంగా అమలు చేయనున్నామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ విజయ ప్రసాద్ తెలిపారు. కరువు జిల్లాలో ఉపాధి హామీ పథకం వల్ల ఎంతోమంది వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా స్థానికంగానే పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఎంతో కీలకమైన ఈ శాఖ ద్వారా వేసవిలో పనిచేసే కూలీలకు పని చేసే చోట నీడ, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స కిట్టు కల్పించాల్సి ఉంది. అయితే దాదాపు ఎక్కడా ఇలాంటి సదుపాయాలు కల్పించడం లేదు. అంతేగాక పనులు చేసి 10 వారాలు అవుతున్న బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 57వేల మంది కూలీలు ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్నారు. అడిగిన వారందరికీ పని కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. అయితే చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కూలీలలో అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ ప్రసాద్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలు ప్రస్తావించారు.

ప్రశ్న : ఉపాధికి పంచ ప్రాధాన్యతలు అంటున్నారు.. వాటి వివరాలు తెలపండి.?

జవాబు : ప్రభుత్వ ఆదేశాలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో 5 అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందించడం జరిగింది. ముఖ్యంగా రైతులకు, కూలీలకు ఉపయోగపడే విధంగా రానున్న వర్షాకాలంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూమిలో ఇంకే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ఇందులో భాగంగానే 5 అంశాల ద్వారా నీటి నిల్వల కోసం ప్రణాళికలు అమలు చేస్తున్నాం. నీటి కుంటలు (ఫారం ఫండ్స్), పంట కాలువలో పూడికతీత, చెరువులు పునరుద్ధరణ, పశువుల నీటి తొట్టెలు నిర్మాణం, కూలీలకు భరోసా అనే 5 ప్రాధాన్యత అంశాలపైనే జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టింది.

ప్ర: జిల్లాలో ఎన్ని నీటి కుంటలు నిర్మించనున్నారు.?

జ : ఈ ఆర్థిక సంవత్సరంలో వేసవిలో కూలీలు వలస వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలన్న లక్ష్యంతో రాబోవు 3 నెలల్లో 9 వేల ఫారం ఫండ్స్ నిర్మించాలని ప్రణాళికను సిద్ధం చేశాం. దీనికి వ్యయం రూ. 62 కోట్లు అవుతుంది. ఈ కుంటల నిర్మాణం వల్ల రైతు పొలాల్లో వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు అవకాశం ఉంది. ప్రధానంగా వర్షపు నీరు వృథా కాకుండా ఆ రైతుల పొలాల్లోనే ఇంకిపోయే అవకాశం ఉంటుంది. తద్వారా భూగర్భ జలాలు పెరగడానికి వీలు ఉంటుంది. ఇది రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అలాగే పశువుల దాహం తీర్చడానికి ప్రతి గ్రామంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఎన్ని తొట్టెలు నిర్మించాలన్నది గుర్తించడం జరిగింది. 1362 నీటి తొట్టెలు నిర్మాణం చేయాలన్న లక్ష్యం కాగా ఇందుకు రూ. 48 కోట్లు ఖర్చు చేయనుం.

ప్ర : చెరువుల పునరుద్ధరణ, కాలువలలో కూడిక తీత పనులు వివరాలు వివరించండి ?

జ: చెరువులలో పూడికతీత పనులు చేపట్టి ఆ మట్టిని రైతు పొలాలకు తోలుకొనే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశాం. గత ఆర్థిక సంవత్సరంలో అమృత సరోవర పథకం క్రింద 82 చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడం జరిగింది. ఇందుకు రూ. 6.48 కోట్లు ఖర్చు చేశాం. పంట కాలువలలో కూడా పూడికతీత పనులు చేపట్టడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేశాం.

ప్ర : ఉపాధి పనులు క్రింద ఇంకా ఏయే పనులు చేపడుతున్నారు.?

జ: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 189 కిలోమీటర్ల సిసి రహదారులు, బిటి రహదారులు నిర్మించడం జరిగింది. ఇందుకు రూ. 150 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. పశువుల పాకలు 1325 గాను 910 షెడ్లు నిర్మించడం జరిగింది. ఇందుకు రూ. 25 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా రూ. 11 కోట్లతో 1800 ఇంకుడు గుంతలు పూర్తి చేశాం. రూ. 42 కోట్లతో సుమారు 7 వేల ఎకరాలలో మొక్కలు పెంపకం చేపట్టాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కూలీల రూపంలో రూ. 240 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ. 193 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ప్రభుత్వ కార్యాలయాల ముందు 109 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశాం.

ప్ర : కూలీలకు పెండింగ్ లో ఉన్న బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారు.?

జ : కూలీలకు సుమారు 10 వారాల బిల్లులు చెల్లించాల్సి ఉంది. అలాగే పశువుల పాకలు (షెడ్లు) నిర్మాణాలకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటికీ రూ. 90 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో నిధులు మంజూరు కానున్నాయి. మంజూరైన వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం.

డ్వామా పీడీ విజయ ప్రసాద్

ప్ర : రైతులకు, కూలీలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి.?

జ : రైతులు తమ పొలాల్లో నిర్మించే ఫారం పాండ్స్‌ను వినియోగించుకోవాలి. చెరువుల్లో పూడిక తీత పనులతో రైతులు తమ భూములకు సారవంతమైన మట్టిని తోలుకోవాలి. వర్షం నీరు చుక్క వృథా కాకుండా భూమిలోనే ఇంకిపోవాలి. అందుకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలి. కూలీలకు ప్రభుత్వం 307 రూపాయల కూలి ఇస్తోంది. వలసలు పోకుండా అడిగిన వారందరికీ ఉపాధి కల్పించడం జరుగుతుంది. పెండింగ్ బిల్లులు త్వరలో ఇస్తాం. పనిచేసే చోటా సదుపాయాలు కల్పించకుంటే తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటాం.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాల్సిందే..

గుత్తిలో భారీ ప్రదర్శన

గుత్తిలో నిరసన తెలుపుతున్న ముస్లిములు

ప్రజాశక్తి-గుత్తి

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో ఆదివారం ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని నిజామీ షాదిఖానా నుంచి పత్తికొండ రోడ్డు కూడలి మెయిన్ బజార్‌గాంధీ సర్కిల్ వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల హక్కులను కాల రాస్తోందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కు, జాతి, మత, కులం, లింగ బేధాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మైనార్టీల ఆస్తులను లక్ష్యంగా చేసుకొని సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేందుకు మోడీ ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు డి.మైనుద్దీన్, ఎస్.అన్వర్ సాహెబ్, ఉమర్, ప్రజా వైద్యశాల ఆసుపత్రి పిఆర్ఓ ఇస్మాయిల్, డి.హుస్సేన్‌పీరా, ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకం రఫీ, సంయుక్త కార్యదర్శి అప్పేచెర్ల దస్తగిరి, కోశాధికారి షేక్ నజీర్ అహ్మద్, నాయకులు ఎండి ఫయాజ్, కటిక మున్వర్, డిష్ అన్వర్, కటిక అన్వర్, అజీజ్‌ఖాన్, దాండియా షఫీ, ముల్లా షాషా, తదితరులు పాల్గొన్నారు.

టిటిడి గోశాలపై ఆరోపణలు తగదు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలపై మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపణలు బాధాకరమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఖండించారు. ఆదివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టిటిడి పరువు, విశ్వసనీయతను దిగజార్చే కుట్రలో భాగమే గోశాలపై ఆరోపణలు అన్నారు. గత మూడు నెలల్లో 40 ఆవుల సహజంగా మృతిచెందాయన్నారు. కరుణాకర్‌రెడ్డి తన ప్రెస్‌మీట్‌లో చూపిన ఫొటోలు టిటిడి గోశాలకు సంబంధించినవిక ఆవన్నారు. గోశాలపై టిటిడి ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఇందులో భాగంగానే 260 మందికిపైగా సిబ్బంది నియమించినట్లు తెలిపారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు మతవిద్వేషాలను రెచ్చగొట్టడంతోపాటు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడటం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రదానంపై రౌండ్ టేబుల్ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ ఛైర్‌పర్సన్ కాపు భారతి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని సుభాష్ రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయ భవనంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కల్పించేందుకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఛైర్‌పర్సన్ కాపు భారతి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ కార్నియా సేకరణ కేంద్రం ప్రారంభ సమయంలో కలెక్టర్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ త్వరలోనే జిల్లాలో కార్నియా ప్రాసెసింగ్ చేయగలిగే కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో త్వరలోనే ఈ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ డాక్టర్ లక్ష్మణ్‌ప్రసాద్, యాపిల్ ఐకేర్ డాక్టర్ జగన్మోహన్, రెడ్‌క్రాస్ ఐ సెంటర్ కమిటీ సభ్యులు డాక్టర్ తిరుపతినాయుడు, చంద్రకాంత్‌నాయుడు, ఆలంబన జనార్దన్, అప్పా సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మెట్టు గోవిందరెడ్డి

దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అకాల వర్షాలతో మండలంలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మెట్టు గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన పంటలు పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడగండ్ల వానతో మండలంలోని వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులు భారీగా నష్టపోయారన్నారు. వారందరికీ ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు వాతావరణ బీమా కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రామాంజనేయులు, నేమకల్లు సర్పంచు పరమేశ్వర, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కబరస్థాన్ కమిటీ ఎన్నిక

నూతనంగా ఎన్నికైన ముస్లిం కబరస్థాన్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-కణేకల్లు

మండల కేంద్రానికి చెందిన కబరస్తాన్ నూతన కమిటీ ఆదివారం స్థానిక ఈద్గా మజీద్‌లో నూరాణి మజీద్ ముతవల్లి హుస్సేన్నా ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గోల్డ్ ఎస్.బషీర్ అహమ్మద్, ఉపాధ్యక్షులుగా మొబైల్ బాషా, ప్రధాన కార్యదర్శిగా జక్రియ, ఉప కార్యదర్శులుగా గౌస్‌పీర్, కళ్యాణదుర్గం షాకీర్, కోశాధికారిగా పెద్దదేవర నబీసాబ్, కమిటీ సభ్యులుగా తపాల్ అయూబ్, యళపి ఖాజాపీరా, మాల్యం ఫారూక్, కె.దాదాపీర్, అఫ్గాన్ అన్వర్‌బాషా, ఎం.జమిల్‌అహమ్మద్, ఎన్.మహబూబ్‌పీరా, ఖాదర్‌వలితోపాటు మరో 24 మంది సభ్యులను ఎన్నుకున్నారు. అలాగే ఈ కమిటీకి గౌరవ సలహాదారులు షేక్ మహమ్మద్‌గౌస్, ఫక్రుద్దీన్, హాజీ, మాహబూబ్‌సాబ్, పెద్ద దేవర అబ్దుల్ హమీద్‌సాబ్, అఫ్గాన్ చిన్న ఫక్రుద్దీన్, ఏంసీ వన్నూర్‌సాబ్, అఫ్గాన్ హుస్సేన్‌సాబ్‌ను కూడా ఎన్నుకున్నారు.

కంటిచూపు లేకుంటే జీవితం అంధకారమే..

ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ తిరుపతినాయుడు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణురాలు షీనా

ప్రజాశక్తి-పామిడి

కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే అని ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు నిపుణురాలు డాక్టర్ షీనా 190 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 106 మందిని కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్, కోశాధికారి షేక్షావలి, ఉపాధ్యక్షుడు పత్రా శ్రీనివాసులు, జిల్లా ఛైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ రోషన్ జమీర్, డైరెక్టర్లు సురేష్, ముండే షేక్షావలి, జంపన గంగ శేఖర్, శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజర్ శివ, శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది, లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సామాజిక చైతన్య యాత్ర

ఆత్మకూరులో నిర్వహించిన యాత్రలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

దళిత, గిరిజన కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా, కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన సామాజిక చైతన్య యాత్ర ఆదివారం మండలంలో సాగింది. ఇందులో భాగంగా మండల కేంద్రంతోపాటు వడ్డుపల్లి, తలుపూరు గ్రామాల్లో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐద్వా, రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిద్ధు, జిల్లా ఉపాధ్యక్షులు విజయ్, కెపిఎస్ జిల్లా నాయకులు జగ్గులు రమేష్, రామునాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, ఐద్వా ఉపాధ్యక్షురాలు చంద్రకళ, రామాంజనమ్మ, సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా సమాజంలో అత్యధిక మంది పేదల బతుకులు మారడం లేదన్నారు. నేటికీ దళిత, గిరిజన వాడల్లో తాగునీరు, రోడ్లు, మురికి కాలువలు, మరుగుదొడ్లు, వీధిలైట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, శ్మశాన స్థలాలు వంటి కనీస సదుపాయాలు లేకపోవడం బాధాకరమన్నారు. మరోవైపు మహిళలు, చిన్నారులు లైంగిక దాడులు, అత్యాచారాలు, వేధింపులు కొనసాగుతున్నా ప్రభుత్వాలు నిద్రావస్థలో ఉన్నాయన్నారు. ఆయా సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి రాజేశ్వరమ్మ, వెంకటమ్మ, ఆచారమ్మ, పంచాయతీ కార్మికులు, శ్రీసత్యసాయి కార్మికులు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : దళిత గిరిజన సామాజిక తరగతుల కనీస సౌకర్యాల సాధన కోసమే సామాజిక చైతన్య యాత్ర చేపట్టినట్లు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు రంగారెడ్డి అన్నారు. ఎస్ఎఫ్ఐ, ఐద్వా, కెవిపిఎస్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక చైతన్య యాత్ర ఆదివారం ఉరవకొండకు చేరుకుంది. ఇందులో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు శ్యామల, చంద్రిక, రామాంజినమ్మ, అశ్విని, కెవిపిఎస్ జిల్లా నాయకులు జీవరత్నం, రాజా, అక్కులప్ప, నాగేంద్ర, నాయకులు భీమేష్, సాయి, విజయ్, ప్రజా సంఘాల నాయకులు నందు, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న తేజ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

ఇంటర్ ఫలితాల్లో 'తేజ' ప్రభంజనం

విద్యార్థులతో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

ఇంటర్ ఫలితాల్లో అనంతపురంలోని తేజ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించింది. ఈ సందర్భంగా ఆదివారం కళాశాల విద్యార్థులతో కలిసి నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తేజ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మార్కుల పంట పండించి సత్తా చాటారన్నారు. ముఖ్యంగా బైపీసీ విభాగంలో స్టేట్ టాపర్ ను అందించినట్లు వివరించారు. సీనియర్ ఇంటర్‌లో రమ్య 991 మార్కులు సాధించిందన్నారు. అలాగే విజయలక్ష్మి (987), ఫాతిమా సుమయా (986), నవనీద్ కృష్ణ (986), మానస (984), వినుత (983) మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో రేష్మవి (435), కృష్ణ చైతన్య (430), నవనీత (430), అక్షర (429), ప్రజ్ఞ రెడ్డి (427) మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కీర్తిశ్రీ (465), షమీరా (465), ఇందువర్ధన్‌రెడ్డి (464), నారాయణరెడ్డి (464), లోహిత్ రెడ్డి (463), నితిన్ (463), సతీష్‌రెడ్డి (462), వరుణ్ సందేశ్ (462), హరిప్రియ రెడ్డి (462), చంద్రపౌర్ణమి (462), ఎం.కావ్య (462), యశ్వంత్‌రెడ్డి (461), పూజితరెడ్డి (460), హేమంత్‌కుమార్ (460) ,రాకేష్ (460) మార్కులు సాధించారన్నారు. కళాశాల స్థాపించిన రెండేళ్లలోనే తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల కృషి, నిష్ణాతులైన అధ్యాపకుల బోధన కారణంగానే తమ కళాశాలకు ఇంతటి విజయం సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ అనిల్‌కుమార్, డైరెక్టర్లు సాయిచైతన్య, నేత్రవాణి, కోఆర్డినేటర్లు రాజశేఖర్‌రెడ్డి, సోమశేఖరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో పాల్గొని అభివృద్ధికి తోడ్పడాలి

యాత్రలో మాట్లాడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

గ్రామాల్లో ఏర్పాటు చేసే గ్రామసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని అభివృద్ధిపై చర్చించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.అల్తాఫ్, ఎం.సాంబశివుడు పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం మండల పరిధిలోని కక్కలపల్లి పంచాయతీలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మైక్ ద్వారా నినాదాలు చేస్తూ గ్రామసభలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం మండల పరిధిలోని అన్నిపంచాయతీల్లో ఈనెల 14వతేదీ నుంచి జరిగే గ్రామసభల్లో పాల్గొ సమస్యలపై ప్రశ్నించాలన్నారు. ప్రజాస్వామ్యానికి గ్రామాలు పట్టుకొమ్మలు అన్నారు. అలాంటి గ్రామాల్లో యువతకు హక్కులు, చట్టాలపై అవగాహన లేకపోవడం చేత ప్రశ్నించాల్సిన గొంతులు మూగబోతున్నాయన్నారు. తద్వారా ప్రజలు లంచాలు ఇస్తూ అధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రతి ఒక్కరూ గ్రామసభలకు వెళ్లి హక్కులును తెలుసుకోవడంతో పాటు అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.సుబ్బరాయుడు, సదాశివ, తిరుపాలు, రూరల్ అధ్యక్షులు సంగా ఫణిభూషణ్, బాబా ఫక్రుద్దీన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పితామహుడు బిపి మండల్

ఆర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణ నాయక్



బిపి మండల్‌కు నివాళులర్పిస్తున్న ఆర్ఇఎఫ్ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

బీసీల రిజర్వేషన్ల పితామహుడు బిపి మండల్ అని రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్ఇఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నారాయణనాయక్ కొనియాడారు. బిపి మండల్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ మండల్ 1918 ఆగస్టు 25న బీహార్‌లో జన్మించి 1952లో బీహార్ అసెంబ్లీకి ఎన్నికయ్యారన్నారు. బీహార్‌లోని బడుగు, బలహీన వర్గాలతోపాటు కార్మికులపై రాజపుత్రుల దాడికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. అంతేగాకుండా బిసిలకు రిజర్వేషన్లు వచ్చి అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఇఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు జి.శ్రీనివాసులు డి.మర్రిస్వామి, మావిటి శ్రీరాములు, యల్లప్ప, ఆర్.మల్లికార్జున, రాయలసీమ కో కన్వీనర్లు జి.రామాంజనేయులు, డి.వరదరాజులు, రమణ, రాజారావు, సుగుమంచి శ్రీనివాసులు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఎస్‌విజిఎం డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వంగా సాగింది. కళాశాలలో 1993-96 మధ్య బిఎ, బీకాం చదివిన విద్యార్థులు ఒకచోట చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 50 ఏళ్ల వయసులో 30 ఏళ్ల కిందటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు. భావితరాలకు సలహాలు, సూచనలు ఇచ్చే స్థాయికి చేరిన ఐదు పదుల వయస్సు వారంతా కేరింతలు కొట్టడం అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో ఎస్‌విజిఎం డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, నాటి అధ్యాపకులు సురేష్‌కుమార్ (కామర్స్), చెంగలయ్య, ఎకనామిక్స్ సురేష్, రాధాకృష్ణ, చంద్రమౌళి, నిర్వాహకులు కంబాల తిమ్మారెడ్డి, పాతిరెడ్డి, కరణం తిప్పేస్వామి, ఆది, ఆంధ్రా తిప్పేస్వామి, గోవర్ధన్, రెడ్డి తిప్పేస్వామి, రాజేంద్ర, పెన్నప్ప, సత్యనారాయణ, గంగాధర్, రహమత్‌బి, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

మట్టలతో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా మట్టల ఆదివారం

పెద్దవడుగూరు : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహినంచారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఐఎస్ఇసీ చర్చిలో సంఘ కాపరి జాన్డేవిడ్ ఆధ్వర్యంలో సభ్యులు ఇమ్మానుయేలు, ఏస్తేరు రాణి ఆనంద్‌రాజ్, శోభారాణి, వీరా, ఇషాకు, సీమోను, రాజు తదితరులు ఈతమట్టలు పట్టుకుని చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పాస్టర్ జాన్ డేవిడ్ సందేశాన్ని ఇచ్చారు. అలాగే చిన్నవడుగూరు, దిమ్మగుడి, గుత్తిఅనంతపురం, విరుపాపురం, లక్షుంపల్లి, క్రిష్టిపాడు, రావులుడికి, ముప్పాలగుత్తి, చిత్రచేడు తదితర గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు.

గాస్పల్ హాల్ అసెంబ్లీ చర్చి నుంచి ఫిలిప్, విజయ్‌కుమార్ బహిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనేక అక్రమాలకు పాల్పడిన జిహెచ్ ఫిలిప్, రిటైర్డ్ ఎంఇఒ విజయ్‌కుమార్‌ను స్థానిక గాస్పల్ హాల్ అసెంబ్లీ చర్చి నుంచి బహిష్కరించినట్లు స్థానిక సంఘ కాపరి టిపి వరప్రసాద్ రెడ్డి, సంఘ పెద్దలు ఆదినారాయణ, ఆసాఫ్ హెరాల్డ్, దేవవరం, సంఘ సభ్యులు కాంతి ఐజక్ అరోరా,రూబేన్, కాంతి జాన్ వెస్లీ, ప్రసాద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ వారు మాట్లాడుతూ జిహెచ్ ఫిలిప్, విజయ్‌కుమార్ నిరంకుశ ధోరణిలో తోటి సంఘ పెద్దలను పక్కనపెట్టి తన ఇష్టం వచ్చినట్లు చర్చి డబ్బులను పక్కదోవ పట్టించారన్నారు. దీంతో సంఘ సభ్యులు అందరూ కలిసి జిహెచ్ పిలుపును గాస్పల్ హాల్ అసెంబ్లీ సంఘం నుంచి బహిష్కరిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు.

కొనసాగిన 'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమ్మె

నిరసన తెలుపుతున్న కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె 8వరోజు ఆదివారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా పట్టణంలోని పంప్‌హౌస్ వద్ద తమ ఆందోళనను కొనసాగించారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకూ ఆందోళనలను కొనసాగిస్తామన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీ చైతన్య' ప్రతిభ



షేక్ ఫిర్దోస్ 466 | వైష్ణవి 464 | అనన్య శౌరి | ఖుర్షియా తహసీన్

అనంతపురం : ఇంటర్ ఫలితాల్లో అనంతపురం శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం ఎంపిసి విభాగంలో షేక్ ఫిర్దోస్ 466, బైపిసి విభాగంలో అనన్య శౌరి, ఖుర్షియా తహసీన్ 435 సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఎంపిసి విభాగంలో 460 మార్కులకుపైగా 18 మంది విద్యార్థులు, బైపీసీ విభాగంలో 430 మార్కులకుపైగా 9మంది విద్యార్థులు సాధించారు. ఈసందర్భంగా ఎజిఎం మురళీకృష్ణ, అధ్యాపకులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

'గ్లోబల్' టాపర్‌గా టపాల్ షరీఫా

కణేకల్లు : జిల్లాకేంద్రంలోని గ్లోబల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మండల కేంద్రానికి చెందిన ప్రజాశక్తి విలేఖరి టపాల్ ఆయూబ్ కూతురు టపాల్ షరీషా అత్యంత ప్రతిభ కనబరిచి టాపర్‌గా నిలిచింది. ఇంటర్ మొదటి సంవత్సరం బైపిసి గ్రూపులో 440 మార్కులకు 433 మార్కులు సాధించి మొదటి స్థానం సాధించింది. దీంతో తల్లిదండ్రులతోపాటు కళాశాల యాజమాన్యం షరీఫాను అభినందించారు. అనంతరం విద్యార్థిని మాట్లాడుతూ కష్టపడి చదివిస్తున్న తన తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యాభ్యాసం కొనసాగిస్తానన్నారు. అంతేగాకుండా తల్లిదండ్రుల ఆశయాలు సాధించేంత వరకూ కష్టపడి చదువుతానన్నారు.

నేడు గ్రామసభ

నార్పల : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు మన్నీల సుప్రియ అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్యామల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

టిడిపి కార్యకర్తల మృతికి నివాళి

నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

పామిడి : మండలంలోని ఎద్దులపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన టిడిపి కార్యకర్తలు శివ, లింగన్న మృతికి టిడిపి నాయకులు ఆదివారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఇద్దరి మృతదేహాలకు పూలమాలలు వేసి అంజళి ఘటించారు. నివాళులర్పించిన వారిలో మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, గౌస్‌పీరా, జింకల సంజీవకుమార్, గీతా హోటల్ వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉన్న టిడిపి కార్యకర్త చంద్ర ఆచారికి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆచారి ఇంటికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, కొండాపురం రంగస్వామి, కొట్టాల సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా గురుకులం ప్రవేశ పరీక్ష

ఉరవకొండ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఇందులో భాగంగా ఉరవకొండలోని శివరామిరెడ్డి కాలనీ సమీపంలో ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప, ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ప్రతి సచివాలయంలో అంబేద్కర్ జయంతి

పుట్లూరు : నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి సచివాలయంలో నేడు అంబేద్కర్ జయంతి నిర్వహించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నార్పల : మండల కేంద్రంలోని క్రాసింగ్ సమీపంలో ఆర్ఎడబ్ల్యు, ఎన్టీఆర్ అభిమానులు ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎన్టీఆర్ అభిమాలు తెలిపారు. తొలిరోజు దాదాపుగా వెయ్యిమందికిపైగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈషా, సాయి, హర్ష, రాజేష్, ఇస్మాయిల్, బాబాసలాం, వినోద్‌చౌదరి, రాఘవ, రాజు, శరత్, చందు, భాను, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో రైతుబిడ్డల ప్రతిభ

పెద్దవడుగూరు : మండలంలోని చిత్రచేడుకు చెందిన దేవరింటి రామాంజనేయులు, ప్రమీల దంపతుల పెద్ద కుమార్తె అర్చన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి గ్రూపులో 985 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. అలాగే రెండో కుమార్తె శ్రీవాణి ప్రథమ సంవత్సరం ఎంపిసి గ్రూపులో 350 మార్కులు సాధించి అబ్బురపరిచింది. రైతు బిడ్డలు మంచి మార్కులు సాధించడంతో పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన పూజిత

శింగనమల : మండల పరిధిలోని సోదనపల్లి గ్రామానికి చెందిన ఆసాదు పూజిత ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిఇసి గ్రూపు చదువుతున్న పూజిత 484 మార్కులు సాధించి మొదటి స్థానం సాధించింది. దీంతో కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, తదితరులు పూజితకు స్వీట్ తినిపించి హర్షం వ్యక్తం చేశారు.

దుస్తులు, ఆట వస్తువుల వితరణ

గుత్తి : పట్టణంలోని కొత్తూరులో ఉన్న స్వీట్ సేవియర్స్ ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన వృద్ధ, అనాథాశ్రమంలో వైసిపి జిల్లా నాయకులు బళ్లారి రాజ్ కుమార్‌రెడ్డి ఆయన కుమార్తె బి.హేమశ్రీరెడ్డి ఆదివారం దుస్తులు, ఆట వస్తువులను వితరణ చేశారు. అలాగే స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు హరినాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి దేవన సూర్యప్రకాష్, రాజేష్, కిరణ్‌కుమార్‌రెడ్డి, షేక్షావలి, సుదర్శన్‌రెడ్డి, ఆటో బాషా, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

బొమ్మనహాల్ : మండలంలోని సింగేపల్లి గ్రామంలో కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నబిరసూల్ తెలిపిన వివరాల మేరకు.. సింగేపల్లికి చెందిన హరిజన రామాంజనేయులు (28) కుటుంబ సభ్యులతో బాధపడుతూ ఉండేవాడు. ఈనేపథ్యంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య వినోదమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.